ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు

5

గురువారం 13 నవంబరు 2025





ఆర్‌యూ రుణం తీర్చుకోండి


- ప్రతి విద్యార్థికి ఉన్నత విద్య కీలకం
- కలను సాకారం చేసుకోండి
- తల్లిదండ్రులు, గురువులను గౌరవించండి
- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- రాయలసీమ వర్సిటీలో ఘనంగా నాలుగో స్నాతకోత్సవం
- విద్యార్థులకు బంగారు పతకాలు, డాక్టరేట్ల ప్రదానం



మాట్లాడుతున్న గౌవర్నర్, వీసీ







కర్నూలు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదర్శంగా, ఉన్నతంగా తీర్చిదిద్దిన రాయలసీమ వర్సిటీతో పాటు సమాజానికి రుణం తీర్చుకోవాలని గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. దేశ ప్రగతి రథానికి విద్యార్థులు చోదకశక్తిగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఆకాంక్షించారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో 4వ స్నాతకోత్సవం (కాన్వకేషన్)కు ఛాన్సలర్ హోదాలో హాజరు అయ్యారు. ఆయనతో పాటు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, వైస్ ఛాన్సలర్ వి.వెంకట బసవరావు, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయ్‌కుమార్ నాయుడు వేదికపైకి చేరుకున్నారు. కలెక్టర్ డాక్టర్ సిరి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అంతకుముందు యూనివర్సిటీ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్‌కు ఎన్‌సీసీ, పోలీస్ బెటాలియన్ బృందాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం డాక్టరేట్ అందుకోబోయే వారు గవర్నర్‌తో కలిసి విడివిడిగా ఫొటోలు తీయించుకున్నారు. అక్కడి నుంచి డాక్టరేట్ దుస్తుల్లో మేళ తాళాల నడుమ వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం సభ వేదికలో గవర్నర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఉన్నత విద్య కీలకం అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో పాటు గురువులను గౌరవించాలన్నారు. ఉన్నత విద్యలో మహిళలు రాణించడం ఎంతో అభినందనీయమన్నారు. రాబోయే స్నాతకోత్సవానికి కూడా తాను తప్పకుండా వస్తానని, అప్పుడు విద్యార్థులు ఎలా చదువుతున్నారో చూస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పరిశ్రమలు, అవకాశాలను యువత కోసం తెచ్చి ఆర్థికంగా దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని తపన పడుతున్నాయన్నారు.

మిగతా 6లో...



రాయలసీమ వర్సిటీలో ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం



వర్సిటీ కీలక అధికారులతో గవర్నర్ అబ్దుల్ నజీర్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న డాక్టర్ ఎస్‌వీ రామకుమార్

వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయకండి

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కల్లూరు డిప్యూటీ తహసీల్దారు విష్ణుప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కల్లూరు, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆయన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాటసాని ఇంటి నుంచి చెన్నమ్మ సర్కిల్ మీదుగా కల్లూరు తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దారు విష్ణుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేసిన వైసీపీ ప్రభుత్వం 7 కళాశాలలను పూర్తి చేసిందన్నారు. గత ప్రభుత్వంలో రెండేళ్లు కరోనా పోగా మూడు సంవత్సరాల్లో జగన్ రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సొంత ఇల్లు

సీఎం చంద్రబాబు సాయం మరువలేనిది: మంత్రి ఫరూక్



గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలందరికీ సొంత ఇల్లు ఇచ్చి, వారి గౌరవాన్ని పెంచిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చాపిరేవుల గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. వైష్ణవి అనే లబ్ధిదారుకు ఇంటి తాళాలు ఇచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లబ్ధిదారులకు చంద్రబాబు చేసిన సాయం మరువలేనిదన్నారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని పేదల ఆర్థిక అభివృద్ధికి అన్ని రకాల సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గత 16 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం మొత్తం 2,85,557 గృహాలను పూర్తి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మార్వో శ్రీవాణి, ఎంపీడీవో సుగుణశ్రీ, హౌసింగ్ డీఈ విజయబాబు, ఈవోఆర్డీ శివనాగజ్యోతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద ఘటన వీడియోలు వైరల్

6లో

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు!

ఇష్టారాజ్యంగా విధులు...!

- నంద్యాలలో 516 సచివాలయాలు
- జిల్లా వ్యాప్తంగా 4,353 మంది ఉద్యోగులు
- డిప్యుటేషన్‌లో 523 మంది విధులు
- పర్యవేక్షణ గాలికి.. పాలన అస్తవ్యస్తం
- మధ్యాహ్నానికి ఇంటికి వెళ్లిపోతున్న ఉద్యోగులు
- ఆ మూడు క్యాడర్ల పని అంతంతే..



బేతంచెర్ల పట్టణంలోని రెండో సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీ కుర్చీలు

నంద్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలలోనే కాదు.. మండల ప్రాంతాల్లో ఇదే దుస్థితి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యోగులు అలా వచ్చి మధ్యాహ్నానికి ఇంటి ముఖం పడుతున్నారు. జిల్లాలో మెజార్టీ వార్డు, గ్రామ సచివాలయాల పరిస్థితి ఇదే. జిల్లా, తాలుకా, మండల కేంద్రాలకు దగ్గర్లో ఉన్న, రోడ్డు మార్గం, బస్సు సౌకర్యం అనుకూలంగా ఉన్న గ్రామ సచివాలయాల్లో ఉద్యోగుల హాజరు పర్లేదు అనిపించినా, మారుమూల గ్రామ సచివాయాల్లో సమయపాలన అస్తవ్యస్తంగా ఉంది. పట్టణ, నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లకు పని ఒత్తిడి అధికంగా ఉంటుందని, మిగిలిన సిబ్బందికి ఆ స్థాయిలో పనులు ఉండడం లేదని అంటున్నారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో ఉద్యోగుల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దారుణ వాస్తవాలు వెలుగు చూశాయి.

జిల్లా వ్యాప్తంగా 516 గ్రామ వార్డు సచివాలయాలు ఉండగా.. ఇందులో 4,353 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టాలనే ఆశయంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పలు మార్పులు చేసింది. నివాస గృహాలు, కుటుంబాలను మ్యాపింగ్ చేశారు. రెండు సచివాలయాను కలిపి ఒక క్లస్టర్‌గా మార్చారు. అదే క్రమంలో ఒక్కో సచివాలయంలో 10-11 మంది సిబ్బంది ఉన్నా, వారికి సరైన జాబ్ చార్ట్ లేకపోవడంతో ఎవరు ఏ పని చేయాలో తెలియని పరిస్థితి ఉండేది. అదనపు సిబ్బంది భారం తగ్గించుకోవడానికి రీ-గ్రూపింగ్ విధానం తీసుకొచ్చారు. 2,500 జనాభాలోపు ఉంటే కేటగిరి-ఏ, 2,501-3,500 వరకు జనాభా ఉంటే కేటగిరి-బి, 3,501 ఆపైన జనాభా ఉంటే కేటగిరి-సీగా గ్రామ, వార్డు సచివాలయాను విభజించారు. కేటగిరి-ఏ సచివాలయంలో ఆరుగురు, కేటగిరి-బీ సచివాలయంలో ఏడుగురు, కేటగిరి-సి సచివాలయంలో 8-10 మంది ఉద్యోగులు పని చేసేలా విధివిధానాలు తీసుకొచ్చారు.



ప్యాపిలి సచివాలయం-2 ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శి కుర్చీ

- **కొందరికే పని భారం:**

గ్రామ సచివాలయాల్లో వీఆర్‌వో, వెల్ఫేర్ సెక్రెటరీ, డిజిటల్ అసిస్టెంట్, ఆరోగ్య కార్యకర్త, సర్వేయర్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, పశు సంవర్ధక సహాయకులు, మహిళా పోలీస్, ఎనర్జీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉంటారు. ఎనర్జీ, ఇంజనీరింగ్ రెండు విభాగాల్లో రెండు సచివాలయాలు కలిపి ఒకరు పని చేయాలి. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్‌వోలకు పని భారం ఎక్కువగా ఉంది. నగర, పట్టణలోని వార్డు సచివాలయాల్లో అడ్మిన్ సెక్రెటరీ, వెల్ఫేర్, ఎడ్యూకేషన్, రెవిన్యూ సెక్రెటరీలు, ఏఎన్ఎం, ప్లానింగ్, అమినిటీస్ సెక్రెటరీ, శానిటేషన్ సెక్రెటరీ, వార్డు ఎనర్జీ సెక్రెటరీ, మహిళా పోలీస్‌లు ఉంటారు. అడ్మిన్, ఎడ్యూకేషన్, ప్లానింగ్, శానిటేషన్ సెక్రెటరీలకు పని భారం ఉంటుంది. మిలిగిన ఉద్యోగులకు ఆ స్థాయిలో పని భారం ఉండడం లేదని తెలుస్తుంది. ప్రతి నెల ఒకటో తారీఖు నుంచి 5 వరకు పింఛన్ల పంపిణీలో మాత్రం సచివాలయ సిబ్బంది అందరూ బిజీగా ఉంటారని తెలుస్తుంది. ప్రస్తుతం కౌశల, ఈకేవైసీ, ఐదేళ్లు దాటిన పిల్లల బయోమెట్రిక్, జియో క్వార్డినేట్ (ఇల్లు మారిన వారి వివరాలు సేకరణ) పనులున్నా కొందరిపైనే పని భారం అధికంగా ఉంటోంది.

ఈనెల పదో తేదీ సోమవారం నాడు ఆంధ్రజ్యోతి పలు సచివాలయాలను విజిట్ చేసింది. అందులో భాగంగా నంద్యాల పట్టణంలోని సరస్వతి నగర్‌లోని 15వ సచివాలయంలో ఈనెల పదో తేదీ సోమవారం ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. 8 మంది ఉద్యోగులు ఉండగా 10:30 గంటలైనా కేవలం ముగ్గురు ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఐదుగురు విధులకు గైర్హాజరయ్యారు.

- రుద్రవరంలోని రెండో సచివాలయంలో సిబ్బంది ఏడుగురికి గాను ముగ్గురే హాజరయ్యారు. ఆ ముగ్గురులో పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్ రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, డిజిటల్ అసిస్టెంట్ చందనప్రియలు ఉన్నారు. సమయపాలన పాటించడంలో సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తున్నారనడానికి ఈ కేంద్రమే నిదర్శనం.
- చాగలమర్రి మండలంలోని శెట్టివీడులో వీహెచ్‌ఏ ఆగస్టు 18 నుంచి ఎలాంటి సెలవు పెట్టకుండా వెళ్లిపోయారు. ఇంత వరకు ఆ పోస్టు గురించి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు సతమతమవుతున్నారు. గొడిగనూరు, శెట్టివీడు గ్రామాల్లో పంట నష్టం, ఈ-క్రాప్ నమోదు సక్రమంగా చేయలేదని, అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.



ఆళ్లగడ్డ తొమ్మిదో సచివాలయంలో ఎవ్వరూ లేని దృశ్యం



రుద్రవరంలో 2వ సచివాలయంలో

ఇసుక అందుబాటులో ఉండాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, నవంబరు 12 : జిల్లాలో ఇసుక రవాణా, విక్రయం పూర్తి పారదర్శకంగా ఉండాలని, ప్రజలకు ఇసుక సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇసుక రవాణా పర్యావరణానికి ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మాత్రమే జరగాలన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, నందికొట్కూరు, నంద్యాల మండలాల్లో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ల రెన్యువల్ అంశాలను సమీక్షిస్తూ..ఆళ్లగడ్డ, నంద్యాల స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు లేకపోవడం, రికార్డుల నిర్వహణలో లోపాలు ఉన్న కారణంగా వాటి రెన్యువల్‌కు అవకాశం లేదన్నారు. నంద్యాల స్టాక్ యార్డ్ డిపో హోల్డర్‌పై విచారణ జరపాలని మైనింగ్ ఏడీని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, జిల్లా మైనింగ్ అధికారి వేణుగోపాల్, కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్, ఆర్డీవో శివారెడ్డి, నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, గ్రౌండ్ వాటర్ అధికారి రఘురాం తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన భూములపై శాశ్వత హక్కులు

- అనుభవంలో ఉన్న భూమికే గుర్తింపు
- రీసర్వే తర్వాత కొత్త పాస్ పుస్తకాలు
- కొట్టాలచెరువు గ్రామసభలో ఎమ్మెల్యే బుడ్డా, కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర రీసర్వే ద్వారా కొట్టాలచెరువు గిరిజన భూములపై శాశ్వత హక్కులు కల్పిస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువు గ్రామంలో గ్రామసభను ఏర్పాటు చేసి గిరిజనుల భూసమస్యలపై చర్చించారు. ముందుగా ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ.. సుమారు 40ఏళ్లుగా నెలకొన్న గిరిజన భూముల సమస్యను రీసర్వే ద్వారా పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే గ్రామసభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రీసర్వే ద్వారా అనుభవంలో ఉన్న భూమికే రైతులకు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ గ్రామంలో సుమారు 393.78 ఎకరాల్లో రీసర్వే చేపట్టి భూములను అనుభవిస్తున్న గిరిజన లబ్ధిదారులకు రెండున్నరన ఎకరాల చొప్పున హక్కు పత్రాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. రీసర్వే తర్వాత కొత్తగా పాస్‌పుస్తకాలు సైతం జారీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్, ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, హౌసింగ్ ఈఈ శ్రీహరిగోపాల్, సర్పంచ్ నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

కొట్టాలచెరువులో ఇళ్ల ప్రారంభం

ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన గృహాలను బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, కలెక్టర్ రాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 6303 గృహాలు నిర్మాణాలు పూర్తయి లబ్దిదారులు ఇళ్లలోకి చేరుతున్నట్లు చెప్పారు.



లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


పీజీ విద్యను పూర్తి చేసి పట్టాలు పొందిన ఆనందంలో విద్యార్థులు


పీహెచ్‌డీ విద్యను పూర్తి చేసి డాక్టరేట్‌లను అందుకునేందుకు వచ్చిన రీసెర్చ్ స్కాలర్లు

ప్రతిభకు పట్టాభిషేకం

- ఆర్‌యూలో 75 మందికి గోల్డ్ మెడల్
- గవర్నర్, వీసీ చేతుల మీదుగా అందుకున్న విద్యార్థులు
- పండుగ వాతావరణంలో 4వ స్నాతకోత్సవం

కర్నూలు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఉన్నత చదువులు అభ్యసించిన విద్యార్థులకు అరుదైన గౌరవం దక్కింది. బుధవారం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఉప కులపతి వి.వెంకట బసవరావు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి చేతుల మీదుగా 75 మంది విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఉన్నత చదువులు పూర్తి చేసుకుని డాక్టరేట్ కోసం వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 4వ స్నాతకోత్సవంలో భాగంగా పండుగ వాతావరణం మధ్య డాక్టరేట్ ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్న విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లో...

గవర్నర్ రాకతో ప్రాధాన్యత సంతరించుకుంది



ఆర్‌యూకు గవర్నర్ రావడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పట్టాల ప్రదానం గవర్నర్ చేతుల మీదుగా జరగడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో సంతోషిస్తున్నారు. గవర్నర్ పక్కలో నిలబడి డాక్టరేట్ తీసుకోవడాన్ని ఎంతో గ్రేట్‌గా ఫీలయ్యా..!

- జమీమా, పీజీ స్టాటిస్టిక్స్

గోల్డ్‌మెడల్ టార్గెట్‌గా పెట్టుకున్నా



స్నాతకోత్సవంలో గోల్డ్‌మెడల్ అందుకోవాలన్న లక్ష్యంతోనే చదివాను. ఫస్ట్ సెమిస్టర్ నుంచి కష్టపడి చదివాను. అనుకున్న లక్ష్యాన్ని సాధించాను. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకోవడం ఆనందంగా ఉంది. బంగారు పతకంతో తల్లిదండ్రులకు, సొంతూరు, చదివిన విద్యా సంస్థకు మంచి పేరు తీసుకొచ్చాను.

- ప్రియదర్శిని, ఎంఎస్సీ, పీజీ

జీవితంలో మర్చిపోలేని రోజు



జీవితంలో మరచిపోలేని రోజు ఇది. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం అంటే మామూలు విషయం కాదు. ఇక్కడి గురువులు, తోటి విద్యార్థులతో కలిసి చదువుకున్న చదువుకు ప్రత్యేక గుర్తింపు ఉండిపోతుంది. కొందరి జీవితాల్లోనే ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయి. అందులో నేను ఉండటం గర్వంగా ఉంది.

- శ్రీహరి, బీటెక్, ఆర్‌యూ

చాలా గర్వంగా ఉంది



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం గర్వంగా ఉంది. ఏ నాడు ఇలాంటి రోజు వస్తుందనుకోలేదు. రాయలసీమ వర్సిటీలో చదువుకోవడం వల్ల ఇలాంటి అరుదైన అవకాశం వచ్చింది. ప్రతి విద్యార్థి క్యాంపస్ వాతావరణంలో చదువుకున్నప్పుడే సమాజంపై విలువ, బయట పరిస్థితులు అన్నీ అవగాహనకు వస్తాయి.

- పృథ్వీ, సివిల్ ఇంజనీరింగ్

గవర్నర్ చేతుల మీదుగా ఊహించలేదు



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటానని ఊహించలేదు. ఇంత మంది అతిథుల నడుమ ఇలాంటి పండుగ వాతావరణంలో గోల్డ్ మెడల్ అందుకోవడం ఆనందంగా ఉంది. చదివిన వర్సిటీలో ఇలాంటి అరుదైన అవకాశం లభించింది. మా తల్లిదండ్రుల కల నేరవేర్చాను.

- శ్రావణి, కామర్స్, పీజీ

తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూశా



మా అమ్మా నాన్న కళ్లలో ఆనందం చూశా. గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడంతో వారు ఎంతో సంబరపడ్డారు. వారి ప్రోత్సాహం వల్లే ఉన్న చదువులు పూర్తి చేయడంతో పాటు ఏకంగా రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాను. నాకు చాలా సంతోషంగా ఉంది.

- యశ్వంతి, ఈసీఈ, బీటెక్

అరుదైన అవకాశం



గవర్నర్ నజీర్ సార్ నుంచి బంగారు పతకం అందుకోవడం ఓ అరుదైన అవకాశం. ఇలాంటివి కొన్ని అనుకోకుండా జీవితంలో జరుగుతుంటాయి. గతంలో వర్సిటీలో జరిగిన మూడు కాన్వొకేషన్లలో గవర్నర్‌లు హాజరు కాలేదు. 4వ కాన్వకేషన్‌కు గవర్నర్ రావడం అంటే అదృష్టంగానే భావిస్తున్నా.

- గౌతమీ, ఎంఎస్సీ, పీజీ

గవర్నర్‌తో పట్టాలు పొందిన విద్యార్థులు



ఆయూ రుణం తీర్చుకోండి

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఉన్నత ఆశయాల్లో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ యూనివర్సిటీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన పేరు ఉందని, ఇక్కడి వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఈ విద్యా సంస్థకు, సమాజానికి రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క విద్యార్థిపై ఉందన్నారు. ఇదిలా ఉండగా ఏఎం గ్రీన్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రామకుమార్‌కు యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. గవర్నర్ నుంచి డాక్టరేట్ అందుకున్న ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు విద్యుత్ రంగంలో తాను చేస్తున్న కృషికి గుర్తింపుగా తనను గౌరవించిన రాయలసీమ వర్సిటీకి రుణపడి ఉంటానన్నారు.


విద్యార్థినికి గోల్డ్‌మెడల్, డిగ్రీ పట్టాను అందజేస్తున్న గవర్నర్ నజీర్

4వ స్నాతకోత్సవంలో...	
డిగ్రీ పట్టాలు పొందిన వారు	18,396
పీజీ పూర్తి చేసిన విద్యార్థులు	246
బంగారు పతకాలు అందుకున్న వారు	75
పీహెచ్‌డీ డాక్టరేట్లు పొందిన వారు	140

వర్సిటీలో మెరుగైన వసతులు

- వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు

రాయలసీమ యూనివర్సిటి మెరుగైన వసతులు ఉన్నాయి. 1976 శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ కింద కొనసాగుతూ 1996లో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ కింద పీజీ సెంటర్‌గా రూపాంతరం చెంది, 2007లో రాయలసీమ యూనివర్సిటీగా ఏర్పడింది. అప్పటి నుండి ఒడిదుడుకుల మధ్య విద్యార్థులకు విద్యను అందిస్తూ, 2019లో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశాం. రీసెర్చ్ విభాగంతో ప్రతి విభాగానికి అత్యాధునిక ల్యాబ్‌లు, పరికరాలు, వసతుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాం. ప్రస్తుతం విద్యార్థుల అడ్మిషన్స్ కూడా పెరిగాయి. ప్రతి విద్యారికి ఉపాధి చూపించే లక్ష్యంగా పలు సంస్థలు, కంపెనీలతో ఇంటర్వ్యూలు నిర్వహించి ఉపాధి అవకాశాల కోసం జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాం. క్వాంటమ్ టెక్నాలజీని విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం.

విజయానికి విద్యే కీలకం

- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- ఘనంగా మాంటిస్సోరి స్వర్ణోత్సవాలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయానికి విద్యే కీలకమని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని ఏ.క్యాంపులో ఉన్న మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్ స్వర్ణోత్సవాలకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మాంటిస్సోరి విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు కళ్యాణమ్మ విగ్రహానికి గవర్నర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అలాగే గోల్డెన్ జూబ్లీ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మాంటిస్సోరి విద్యాసంస్థలను కళ్యాణమ్మ అంకిత భావంతో విద్యారంగం అభివృద్ధికి కృషి చేశారన్నారు. వినూత్న బోధనా పద్ధతులను అమలు చేయడంలో మాంటిస్సోరి విద్యాసంస్థలు కృషి చేశాయన్నారు. ఈ విద్యా సంస్థలో చదివినవారు ఎంతోమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లు, ఐపీఎస్, ఐఏఎస్‌లుగా ఎదిగారన్నారు. అయితే జడ్జీలు, గవర్నర్‌లు ఎవరూ కాలేదా? అని ఆయన చమత్కరించారు. అసమానతలను తగ్గించడంలో విద్య ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ మాంటిస్సోరి విద్యాసంస్థలు సమాజంలో ఎంతోమందిని ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు కృషి చేశాయన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మాంటిస్సోరి విద్యాసంస్థలు వేలాది మంది విద్యార్థులకు చదువుతో పాటు జ్ఞానం, మంచి నడవడికను నేర్పుతున్నాయన్నారు. గవర్నర్‌కు పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనం సమర్పించాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, మాంటిస్సోరి పాఠశాలల చైర్మన్ రాజశేఖర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వినూషారెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, పీటీవీ సుబ్బయ్య, కేజే రెడ్డి, అపుస్మా జిల్లా అధ్యక్షులు వాసుదేవయ్య, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, యుగంధర్, అధ్యాపకులు, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్


సభావేదికపై గవర్నర్‌తో పాటు కలెక్టర్ సిరి, టీజీ వెంకటేశ్, రాజశేఖర్, ఎంపీ నాగరాజు


హాజరైన అతిథులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్

చౌడేశ్వరీ మాత హుండీలో 52.10 లక్షలు

బనగానపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయం హుండీని బుధవారం లెక్కించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు హుండీని లెక్కించగా రూ.52.10 లక్షల నగదు, బంగారు, 44 గ్రాముల 510 మిల్లీ గ్రాముల బంగారు, వెండి ఒక కేజీ 710 గ్రాముల లభించినట్లు ఏసీ తెలిపారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ హరిశ్చంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న భక్తులు

నంద్యాల ఉపాధ్యాయుడికి అబ్దుల్ హక్‌అవార్డు

- ఉర్దూ భాషలో విశేష కృషికి గుర్తింపు


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అంజద్‌బాషా సిద్ధిఖీ

నంద్యాల కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉర్దూభాషాభివృద్ధి, ఉర్దూ విద్యార్థులకు గుణాత్మకంగా విద్య అందించడం, విద్యార్థులలో నైతికవిలువలు పెంచడం వంటి కీలక కృషికి గుర్తింపుగా డా.అబ్దుల్ హక్ అవార్డును నంద్యాలకు చెందిన ఉర్దూ లాంగ్వేజ్ పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న అంజద్‌బాషా సిద్ధిఖీ అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం అంజద్‌బాషా సిద్ధిఖీ మాట్లాడుతూ నవంబరు 11వతేదీ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఆ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం, మెమెంటో, రూ.125000 క్యాష్‌ప్రైజ్ అందించినట్లు తెలిపారు. అంజద్‌బాషా సిద్దిఖీ స్థానిక కలీల్‌సిద్దికీ హైస్కూల్‌లో ఉర్దూ పండిట్‌గా పనిచేస్తున్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు!



తల్లీ బిడ్డలతో డాక్టర్ శశికళ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎన్‌ఆర్ పేటలోని సాహితి హాస్పిటల్‌లో ఏ. భారతి అనే మహిళ ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా వీపనగండ్ల మండలం దగడపల్లి గ్రామానికి చెందిన ఏ.భాస్కర్, ఏ.భారతి దంపతులకు మూడేళ్ల క్రితం పెళ్లయింది. సంతానం కలగకపోవడంతో భారతి నగరంలోని ఎన్‌ఆర్ పేటలోని సాహితి మెటర్నిటీ ఇన్‌ఫెర్టిలిటీ ప్రెగ్నెన్సీ కేర్ సెంటర్‌కు చెందిన ప్రసూతి వైద్యురాలు డాక్టర్ శశికళను సంప్రదించారు. మొదటి నెలలోనే భారతి అనే మహిళ గర్భం దాల్చడంతో గర్భంలో ముగ్గురు పిల్లలు ఉన్నట్లు డాక్టర్ శశికళ గుర్తించారు. ప్రతి నెలా రెగ్యులర్‌గా పరీక్షించి చికిత్స అందించారు. ఈ నెల 5వ తేదీ పురిటినొప్పులు రావడంతో సాహితి హాస్పిటల్‌లో గర్భిణీకి గైనిక్ వైద్యురాలు డా.శశికళ, అనస్తీషియా డాక్టర్ డా.రాంభూపాల్ రెడ్డి చిన్న పిల్లల వైద్యనిపుణులు డా.లక్ష్మీనారాయణ ఆపరేషన్ చేశారు. దీంతో ఆమె ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మొదట ఆడపిల్ల 1.4 కేజీలు, రెండోసారి ఆడ పిల్ల 1.7 కేజీలు, మూడోసారి అబ్బాయి 1.4 కేజీలతో జన్మించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండటంతో బుధవారం వారు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు.

బస్సు ప్రమాద ఘటన
వీడియోలు వైరల్

కర్నూలు క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు శివారులో గత నెల 24వ తేదీన జరిగిన బస్సు ప్రమాద ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రమాదం జరిగిన సమయం కంటే ముందు ఆ మార్గంలో వెళ్లిన ప్రైవేటు బస్సు డాష్క్‌మ్‌లో రికార్డయిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. బైక్ యాక్సిడెంట్ తర్వాత శివశంకర్ కింద పడి మృతి చెందగా.. ఎర్రిస్వామి స్వల్ప గాయాలతో బయటపడి తానే శివశంకర్‌ను పక్కకు లాగానని పోలీసులకు చెప్పుకొచ్చాడు. దీనిపై గత కొద్ది కాలంగా అస్పష్టత నెలకొని ఉండేది. తాజాగా వైరల్ అయిన వీడియోతో బైక్ ప్రమాదం ముందే జరిగిందని ఎర్రిస్వామి చెప్పిన మాట నిజమేనని తెలిపాయి. ఈ ప్రమాదంలో బైక్ కుడి పక్కకు పడిపోగా.. మృతి చెందిన శివశంకర్‌ను ఎడమవైపునకు లాగిన దృశ్యాలు ఉన్నాయి. కొన్ని బస్సులు ఆ బైక్‌ను తప్పించుకుని వెళ్లిన వీడియోల దృశ్యాలు వీడియోలో కనిపించాయి. కానీ కావేరి ట్రావెల్స్ బస్సు మాత్రం తప్పించలేకపోవడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. దీంతో పాటు సమీపంలోని ఓ డాబాలో ఉన్న సీసీ పుటేజీ కూడా విడుదలైంది. ఇందులో వి. కావేరీ బస్సు ముందుకు రావడం, అందులో నుంచి క్షణాల్లో మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటం స్పష్టంగా కనిపించాయి. సరిగ్గా రాత్రి 2:44 గంటలకు మంటలు వ్యాపించినట్లు వీడియోలో కనిపిస్తోంది. అంతకుముందు రాత్రి 2:25 నిమిషాలకు రోడ్డు ప్రమాదం జరగడం, ఆ సమయంలోనే శివ మృతదేహాన్ని స్నేహితుడు ఎర్రిస్వామి రోడ్డుపక్కకు లాక్కొని రావడం వీడియోల్లో కనపడుతోంది.


శివశంకర్ మృతదేహం వద్ద ఎర్రిస్వామి, పక్కనే వెళ్తున్న బస్సు



ఏపీకి పెట్టుబడులతో రండి


పారిశ్రామిక వేత్తలతో నిర్వహించిన సమావేశంలో ఎంపీ

నంద్యాల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు ఏపీకి పెట్టుబడులతో రావాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి కోరారు. బుధవారం న్యూ డిల్లీలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 వతేదీ విశాఖ పట్టణంలో సీసీఐ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అక్రమార్కుల చేపల రవాణా

- చోద్యం చూసిన ఎఫ్‌డీవో నాగరాజు
- రిజర్వాయరును తనిఖీ చేసిన మత్స్యశాఖ అధికారి రంగనాథ్‌బాబు
- 24 గంటల్లో ఖాళీ చేయాలని హెచ్చరికలు
- జిల్లా అధికారి ఆదేశాలు పట్టించుకోని అక్రమార్కులు



రిజర్వాయరు వద్ద హెచ్చరికలు జారీచేస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి



రిజర్వాయరు వద్ద అలాగే ఉన్న షెడ్లు

పత్తికొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయరులో అక్రమార్కుల ఆగడాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కట్టడి చేయాల్సిన మత్స్యశాఖ అధికారులు అక్రమార్కుల చేపల రవాణాను అడ్డుకట్ట వేయకుండా చోద్యం చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బుధవారం ఆంధ్రజ్యోతి పరిశీలనలో విస్తుపోయే దృశ్యాలు కనిపించాయి. మత్స్యశాఖ ఎఫ్‌డీఓ నాగరాజు కళ్లెదుటే అక్రమార్కులు రిజర్వాయరులో పట్టిన చేపలను బాక్సుల్లో నింపి దర్జాగా వాహనాల్లోకి ఎక్కించారు. అక్రమార్కులపై కేసులు పెట్టాల్సిన ఆ అధికారి చోద్యం చూస్తూ నిలుచోవడం గమనార్హం. అక్రమార్కుల నుండి రాజకీయ ఒత్తిళ్ల మేరకు అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారా లేక ఇతర కారణాలు ఉన్నాయా తెలియాల్సి ఉంది.

రిజర్వాయరును పరిశీలించిన జిల్లా మత్స్యశాఖ అధికారి

ఇదిలా ఉండగా మంగళవారం జిల్లా మత్స్యశాఖ అధికారి రంగనాథ్‌బాబు పందికోన రిజర్వాయరును పరిశీలించారు. చేపల వేట సాగిస్తున్న అక్రమార్కులకు నోటీసులు జారీచేయడంతోపాటు 24 గంటల్లో గుడిసెలు, పడవలతోపాటు అక్కడ ఉన్న సరంజామ మొత్తం ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనాల ఆధారంగా చేపల అక్రమాల వేటపై విచారణకు వచ్చామన్నారు. 24 గంటల్లోగా ఖాళీచేయని పక్షంలో కాంట్రాక్టరు, సిబ్బంది, కూలీలపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. కాగా 24 గంటలు గడిచాక కూడా కూలీలు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయకపోగా మత్స్యశాఖ అధికారి కళ్లెదుటే పట్టిన చేపలను వాహనాలలో ఎక్కించారు. దీని ఆంతర్యం ఏమిటో తెలియాల్సి ఉంది. జిల్లా అధికారి హెచ్చరికలు జారీ చేసినా అక్రమార్కులు చేపలు పట్టడం ఆపలేదు. గుడిసెలు తొలగించక లేదు. ఇంత జరిగినా జిల్లా అధికారి వారిపై కేసులు నమోదుకాకపోవడం గమనార్హం.

రికవరీ చేయాలి

పందికోన రిజర్వాయరులో జూన్ 30కి గడువు ముగిసినప్పటికీ 4 నెలలు పైగా అక్రమార్కులు చేపల వేట సాగించారని, రూ. లక్షల్లో వారు దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలని సీపీఐ నాయకులు బుధవారం అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. మండల, పట్టణ కార్యదర్శులు కారుమంచి, రామాంజనేయులు మాట్లాడుతూ గడువు ముగిసి నాలుగున్నర నెలలు గడిచినా కొందరు రిజర్వాయరులో అక్రమంగా చేపల వేట కొనసాగిస్తున్నారన్నారు. అధికారులు మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు.

మెడికల్ కాలేజీలపై జగన్ మొసలి కన్నీరు

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

ప్యాపిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీలపై మాజీ సీఎం వైఎస్ జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీపీపీ విధానంతో రాష్ట్రంలో రెండేళ్లలో 1750 మెడికల్ సీట్లు పెరిగే అవకాశం ఉందని అన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుదర్శన్, మామిళ్లపల్లి మోహన్ యాదవ్, బట్టా సత్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడిపై బైండోవర్ కేసు

- సీఎంను విమర్శిస్తే ఉపేక్షించమని ఎస్ఐ హెచ్చరిక

ఆలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ రైతు విభాగం ఆలూరు అధ్యక్షుడు అరికెర వెంకటేశ్వర్లుపై ఆలూరు పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. వైకుంఠం శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు రోజుల క్రితం ఈ కేసు నమోదు చేశారు. ఇలాంటి విమర్శలు ఎక్కడ చేసినా రౌడీషీట్ తెరుస్తామని ఎస్ఐ మన్మధవిజయ్ బుధవారం హెచ్చరించారు. ఈ విషయంపై ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆదేశాల మేరకు ఆయన సోదరుడు వెంకటేష్, వైసీపీ కార్యకర్తలు స్టేషన్ చేరుకుని అరికెర వెంకటేశ్వర్లుకు మద్దతుగా నిలిచారు.

ఆక్వా స్విమ్మింగ్ పోటీల్లో కర్నూలు జిల్లా ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఆక్వా స్విమ్మింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు పతకాలు వరించాయి. ఈ స్విమ్మింగ్ పోటీల్లో కర్నూలు జిల్లా బాలికలు కే.వైశాలి 400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో గోల్డ్ మెడల్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ బ్రౌంజ్ మెడల్, జూనియర్ కాలేజీ ప్యాపిలి చెందిన ఎం.అర్చన 800 మీటర్ల ఫ్రీస్టైల్ సిల్వర్ 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ బ్రౌంజ్, జడ్పీహెచ్ఎస్ ప్యాపిలి చెందిన పి.హేమలత 50 మీటర్ల బటర్ ఫ్లై గోల్డ్ మెడల్, 100 మీటర్ల బటర్ ఫ్లై గోల్డ్ మెడల్ 100 మీటర్లలో బ్యాక్ స్ట్రోక్‌లో బ్రౌంజ్ మెడల్, నారాయణ కాలేజీకి చెందిన జి.గోవర్దని 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో 5వ రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించారనీ కోచ్ విజయలక్ష్మి, పీడీలను డీఈవో శామ్యూల్ పాల్, డీవీఈవో సురేష్ బాబు, ఆర్‌ఐవో జి.లాలెప్ప, డీఐఈవో శంకర్ నాయక్, ఉమ్మడి జిల్లాల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ డీసీవో డా.ఐ.శ్రీదేవి ఆర్గనైజింగ్ సెక్రటరీ కే.రాఘవేంద్ర అభినందించారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం

- సురక్షితంగా బయట పడిన దంపతులు



దగ్ధమైన కారు

ప్యాపిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏనుగమర్రి గ్రామం దగ్గర బుధవారం 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఒక కారు ఇంజన్‌లోంచి మంటలు వ్యాపించి వాహనం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దంపతులు అప్రమత్తమై సురక్షితంగా బయట పడ్డారు. డోన్ పట్టణానికి చెందిన బ్రహ్మయ్య, ప్రశాంతి దంపతులు బ్యాంకు పని నిమిత్తం మారుతి కారులో పత్తికొండకు వెళ్లారు. అక్కడ పని ముగించుకొని తిరిగి డోన్‌కు బయలు దేరారు. మార్గమధ్యలోని ఏనుగమర్రి గ్రామం సమీపంలోని వనరుచి హోటల్ దగ్గరకు రాగానే కారు ఇంజన్‌లో పొగలు రావడం కనిపించారు. అప్రమత్తమైన దంపతులు కారు దిగి హోటల్‌లోకి వెళ్లారు. ఆ తర్వాత వెంటనే కారు మంటలకు పూర్తిగా దగ్ధమైంది. డోన్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది.

రికార్డు రూమ్‌కు భద్రత కరువు



రికార్డు గదిలో అనధికారిక వ్యక్తి (సర్కిల్‌లో)

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ప్రతి సమాచారం ఫైల్ రూపంలో భద్రపరిచే గదే రికార్డు గది. ఆ రికార్డు రూమ్‌కు కలెక్టర్ కార్యాలయంలో భద్రత కరువైంది. రికార్డు రూమ్‌లో అనధికారికంగా కొందరు వ్యక్తులు పని చేస్తున్నారు. ఇక్కడ ఫైల్‌లో నిక్షిప్తమైన సమాచారం. అత్యంత చాలా కీలకమైనది. కానీ అనధికారిక వ్యక్తులు కొన్ని ఫైల్ సమాచారాన్ని ఇతరులకు చేరవేస్తున్నారు. సమాచారం చేయడంతో పాటు సొమ్ము చేసుకుంటున్నారు. కనీసం రికార్డు రూమ్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడం కొసమెరుపు. రికార్డు గదిని పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. బ్రిటీష్ కాలం నుంచి నేటి వరకు భద్రపరిచిన ఫైల్ పదిలంగా లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. రికార్డు గదిలోకి వెళ్లాలంటే కనీసం ఉన్నతాధికారులు అనుమతి ఉండాలి. అలా లేకపోవడంతో భద్రత వైఫల్యం స్పష్టంగా కనపడుతుంది. ఈ మేరకు డీఆర్వో వెంకట నారాయణమ్మ స్పందిస్తూ రికార్డు గదిలోకి అనధికారిక వ్యక్తులకు ప్రవేశం లేదు. అలా ఎవరైనా ఉంటే కచ్చితంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఐఎంఏ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భారతీయ వైద్య సంఘం(ఐఎంఏ) నంద్యాల శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, కోశాధికారిగా డాక్టర్ హరితతో పాటు మిగిలిన కార్యవర్గ తో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులుగా మల్లీశ్వరి, లలిత, కోశాధికారిగా శశి కిరణ్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు మధుసూదనరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. 38 మంది వివిధ పదవీ బాధ్యతలను నంద్యాల ఐఎంఏలో 32 మహిళా వైద్య విభాగం బాధ్యతలను, 15 మంది ఏఎంఎస్ విభాగం బాధ్యతలను స్వీకరించారు.

వైసీపీ అసత్య ఆరోపణలు

- బీజేపీ అధికార ప్రతినిధి వినూషారెడ్డి



మాట్లాడుతున్న వినూషారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైద్యకళాశాలల ఏర్పాటులో పీపీపీ విధానంపై వైసీపీ చేస్తున్నది అసత్య ఆరోపణలు అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.వినూషా రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నెహ్రూనగర్‌లోని తన గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలను తప్పుదారి పట్టించి రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే ఈ ప్రచారం ఉద్దేశమన్నారు. పీపీపీ అంటే ప్రైవేటైజేషన్ కాదు అని, ఇది ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు అవుతుందన్నారు. వీటి కాలపరిమితి 33సంవత్సరాలు అమలులో ఉంటుం దన్నారు. భూమి, భవనాలు, కళాశాలలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయన్నారు. వైసీపీ ప్రభుత్వం 17మెడికల్ కళాశాలలకు రూ.8,480కోట్లు అంచనా వేసి కేవలం రూ.1550 కోట్లు మాత్రమే ఐదు సంవత్సరాల్లో ఖర్చు చేసిందన్నారు. వైసీపీ పాలనలో జరిగిన టీటీడీ లడ్డూ, మద్యం కుంభకోణంపై సమాధానం చెప్పలేక ఆపార్టీ అబద్ధపు ప్రచారం చేస్తుందని, ప్రజలు ఈ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు

బేతంచెర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్ బాషా (41) అనే వ్యక్తి బుధవారం దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్ బాషా గత రాత్రి తన ఇంట్లో ఉండగా, అదే గ్రామానికి చెందిన బోయ మధు భూపాల్ వచ్చి బల్లెంతో, రోకలిబండతో దాడి చేసి హత్య చేశాడు. మహబూబ్ బాషా భార్యతో బోయ మధు భూపాల్‌కు వివాహేతర సంబంధమే దీనికి కారణమని తెలుస్తోంది. బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమార్తె ఆసియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శివయ్య(ఫైల్)

ఆళ్లగడ్డ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టిడ్కో గృహసముదాయంలో నివసిస్తున్న శివయ్య(48) గుర్తు తెలియని వాహనం ఢీకొని బుధవారం మృతి చెందాడు. శివయ్య ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి ఆటోలో పట్టణానికి వస్తుండగా జాతీయ రహదారిపై వెళుతున్న గుర్తు తెలియని వాహనం అతి వేగంగా ఢీ కొట్టింది. దీంతో శివయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆయనను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



నీతమ్మ (ఫైల్)

ఆళ్లగడ్డ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని ఎస్‌వీ నగర్ కాలనీకి చెందిన నీతమ్మ(40)బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. గత కొన్ని రోజులుగా నీతమ్మ మానసిక సమస్యలతో బాధపడుతున్నది. భర్త పలు ఆసుపత్రులలో ఆమెకు చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో ఆమెకు జీవితంపై విరక్తి కలిగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. టౌన్ పోలీసులు మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇండస్ట్రియల్ హబ్ చంద్రబాబు ఘనతే

- ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



ఎమ్మెల్యే గౌరు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లుకు ఇండస్ట్రియల్ హబ్‌ను తీసుకువచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. ఓర్వకల్లులో జయరాజ్ ఇస్పాత్ తామే తీసుకువచ్చామని, పాణ్యంలో అభివృద్ధి తమ వల్లే సాధ్యమైందని మాజీ ఎమ్మెల్యే కాటసాని అనడం పట్ల గౌరుచరితారెడ్డి స్పందించారు. ఈవిషయంలో యాగంటీశ్వరుని చెంత ప్రమాణం చేస్తారా అంటూ స్పందించారు. 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తానని హామీ ఇచ్చి కృషిచేస్తున్నారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ కె. పార్వతమ్మ, డైరెక్టర్లు రామాంజనేయులు, శ్రీనివాసరావు, పల్లె. ప్రభాకర్‌రెడ్డి, శైలజాయాదవ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో పీడీ ప్రతిభ

- అభినందించిన డీఈవో జనార్దన్‌రెడ్డి



ప్రతిభ కనపరిచిన బాషకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా లోని సంజామల మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న బాషా ఫిజికల్ డైరెక్టర్ ఇటీవల చెన్నైలో జరిగిన అంతర్జాతీయ పోటీలలో ఎంతో ప్రతిభ కనపరిచాడు. షాట్ పుట్ 40 విభాగంలో పాల్గొని పదో స్థానం సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో 10వ స్థానం సాధించిన పీడీకి జిల్లా విద్యా శాఖాధికారి జనార్దన్‌రెడ్డి జ్ఞాపికను, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఇలాంటి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ప్రకాశం పాఠశాల విద్యార్థులు



ఉపాధ్యాయులతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రకాష్‌నగర్ టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక నగర పాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారనీ వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 నెట్‌బాల్ పోటీలో సుప్రియ, సుస్మిత, గలుకలు, క్రీడలో తులసి, ఈరేష్, అండర్-14 విభాగంలో కీర్తన, గలకాలో అభిషేక్, టంగాట మార్షల్స్ గేమ్స్‌కు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే అండర్-17 టంగాట మార్షల్స్‌లో వీరేష్, భరత్, షమీనాపాజ్ శేఖర్, అండర్-19 విభాగం గటకా గేమ్‌లో ఆయేషా సిద్దికి, సాఫ్ట్ టెన్నిస్‌లో బి.విజయలక్ష్మి, అండర్-14 నెట్‌బాల్‌లో అభిషేక్, చిన్నారి, హాకీలో తేజస్విని ఎంపికయ్యారు. పాఠశాల హెచ్ఎం ఖాజా సాహెబ్ క్రీడాకారులను పాఠశాల ప్రార్థనవేళలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం నాయకులు కోర్టుకు హాజరు



కోర్టుకు హాజరైన సర్పంచుల సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి దేవసింగ్ చౌహాన్‌ను 2023 డిసెంబర్ 16న కోడుమూరులో ఏపీ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో అడ్డుకోవడంతో అప్పట్లో నమోదైన కేసులో బుధవారం నగరంలోని కోర్టుకు ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్, సర్పంచుల సంఘం నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సర్పంచుల నిధులు విడుదల చేయాలని కోరుతూ తాము నిరసన తెలిపినందుకు ఈకేసు నమోదు చేశారన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, ఉపాధ్యక్షురాలు భాగ్యరత్న కోర్టుకు హాజరయ్యారు.

ఉర్దూ వర్సిటీ పాలనపై ఆరా



ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న వీసీ

కర్నూలు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూవర్సిటీ పాలన తీరుపై ఉన్నత విద్యామండలి చైర్మన్ కె. మధుమూర్తి ఆరాతీశారు. బుధవారం వర్సిటీకి చేరుకున్న ఆయనకు ఉపకులపతి ప్రొఫెసర్ షావలిఖాన్ పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. వర్సిటీ అద్దెభవనంలో కొనసాగడంతోపాటు ఏమైనా ఇబ్బందులు, లోపాలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రార్ లోకానాథ్, ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మంత్రాలయం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర పురానికి చెందిన మల్లేశ్(48)అనే వ్యక్తి తన ఇంటి దగ్గర అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాలివీ.. మల్లేశ్‌కు మూర్ఛవ్యాధితో బాధపడుతుండేవాడు. బుధవారం సాయంత్రం ఇంటి ముందు ఉన్న కట్టమీదపడి రక్తపు మడుగులో మృతి చెందాడు. ఆయన భార్య రామమ్మ కూలీ పనులకు వెళ్లి రాత్రి చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మల్లేశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మల్లేశ్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అర్హులందరికీ గృహాలు మంజూరు

- ఇళ్ల నిర్మాణాలకు నాలుగు దశల్లో బిల్లులు చెల్లింపు
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ గృహాలను మంజూరు చేస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పీఎంఏవై - 2.0 కింద 272 మందికి మంజూరైన గృహనిర్మాణాల హామీ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఎంఏవై-2.0 ద్వారా ప్రభుత్వం అర్బన్ ఏరియాల్లో రూ.2.5లక్షల సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.5లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర వాటాగా రూ.లక్ష సాయాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ఈ మొత్తాన్ని నాలుగు విడదల్లో చెల్లింపులు చేయనున్నట్లు చెప్పారు. లబ్దిదారులు నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ హరిగోపాల్, ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఉమర్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, ఎంపీపీ తిరుపాలమ్మ, సొసైటీ చైర్మన్ షాబుద్దిన్, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్ర బాబు, వేణుగోపాల్, నాయకులు శివప్రసాద్ రెడ్డి, అబ్దుల్లాపురం బాషా తదితరులున్నారు.


లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా


నందికొట్కూరులో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య


నంద్యాలలో కత్తి సుబ్బలక్ష్మమ్మ దంపతులకు ఇంటి తాళం అందజేస్తున్న ఫయాజ్

చెత్త సేకరణ ట్రాక్టర్ల ప్రారంభం

స్వచ్ఛ భారత్ పథకం ద్వారా ఆత్మకూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని కరివేన, వడ్లరామాపురం, కురుకుంద గ్రామాలకు నూతనంగా మంజూరైన చెత్త సేకరణ ట్రాక్టర్లను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త సేకరణ ట్రాక్టర్ల ద్వారా స్వచ్ఛభారత్ లక్ష్యాలు నెరవేరాలని ఆకాంక్షించారు.

నందికొట్కూరు పట్టణంలో...

నందికొట్కూరు: పీఎంఏవై పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. బుధవారం పట్టణంలోని కోటా వీధిలో పీఎంఏవై ద్వారా నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రారంభోత్సవంతో పాటు, నూతనంగా మంజూరు అయిన గృహాల అనుమతి పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ భాస్కరరెడ్డి, మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, సహకార సొసైటీ చైర్మన్ ముర్తుజావలి, కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, చిన్నరాజు, టీడీపీ నాయకులు జమీల్, శాలు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల పట్టణంలో..

నంద్యాల కల్చరల్: పేదలందరికీ ఇళ్ల నిర్మాణ పథకం కింద నిధులు మంజూరుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలుగుయువత నాయకుడు ఎస్ఎండీ ఫయాజ్ అన్నారు. బుధవారం పట్టణంలో తెలుగుపేటలోని హరిజనవాడలో కత్తి సుబ్బలక్ష్మమ్మ, కత్తి సుబ్బరాయుడు దంపతుల గృహప్రవేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఇంటితాళాలు ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం వార్డు ఇన్‌చార్జి వెంకట్, హౌసింగ్ సిబ్బంది సిద్దిఖ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించొద్దు


నంద్యాలలో ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు


నందికొట్కూరులో డీటీకి వినతి పత్రాన్ని ఇస్తున్న నాయకులు


ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ శ్రేణులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి) : మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించొద్దని, ఇది దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని ఉదయానందా రెసిడెన్సీ నుంచి వైసీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌కు చేరుకొని జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైసీపీ స్టేట్ కౌన్సిల్ నంబర్సు సాయినాథ్‌రెడ్డి, రామలింగారెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దార్మిల్ అమీర్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, నంద్యాల వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, స్టేట్ వైసీపీ మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శశికళరెడ్డి పాల్గొన్నారు.

● **నందికొట్కూరు/రూరల్:** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గపు ఆలోచన అని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ అన్నారు. బుధవారం పట్టణంలోని పటేల్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సేవ్ మెడిక్ కళాశాలలు అంటూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డా.ధార సుధీర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెడికల్ విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం ఈ పీపీపీ విధానాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. అనంతరం డీటీ సోమేశ్వరీదేవికి వినతి పత్రం అందజేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు:** రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం అన్యాయమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ పరిశీలకులు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నంద్యాల టర్నింగ్‌లో దివంగత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి వైసీపీ శ్రేణులతో కలిసి కేజీరోడ్డు, పాతబస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు సయ్యద్‌మీర్, మారుబత్తుల విజయ్, మనీర్‌బాషా తదితరులున్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు

గోస్పాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లెల్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడటం వల్ల భూమి నిస్సారమైపోతుందని, వాటిని తగ్గించి సేంద్రియ జీవన ఎరువులను వాడాలని రైతులకు సూచించారు. దీనివల్ల భూమి, మానవాళి ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు. 25రోజుల దశలో ఉన్న జొన్న పైరును పరిశీలించి మొక్క పెరుగుదలకు ఫార్ములా-4 మైక్రోన్యూట్రియన్స్, మల్టీ కె స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని, వాణిజ్య పంటలు, చిరుధాన్యాలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్, ఏవో స్వప్నిక, వెటర్నరీ డాక్టర్ అభిలాష్, ఏఈవోలు రామకృష్ణ, నాగార్జున, దివాకర్‌రెడ్డి, గ్రామ రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా సేంద్రి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని నందికొట్కూరు వ్యవసాయ సంచాలకుడు గిరీష్ సూచించారు. మంగళవారం నందికొట్కూరు గ్రామం పొలిమేరలో ఏవో షేక్షావలితో కలిసి పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు రైతు సంఘం నాయకులు పుల్లారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.


జొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు

కొత్తపల్లి: రైతులు లైసెన్సు ఉన్న డీలర్ల వద్దనే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి అమీరున్నిసా బేగం సూచించారు. బుధవారం మండలంలోని ఎదురుపాడు, గోకవరం గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది, రైతులతో కలిసి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏవో రైతులతో మాట్లాడుతూ విత్తన శుద్ధిపై సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఇమ్రాన్, విజయ్, రైతులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

- సీపీఎం నాయకుల డిమాండ్
- బస్సులకు అడ్డంగా పడుకోని నిరసన


పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఎం, రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర కల్పించి కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీపీఎం, ఏపీ రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు వచ్చి సమాధానం చెప్పేంత వరకు రాస్తారోకోను విరమించేది లేదని, రోడ్డుపై ఆర్టీసీ బస్సుల ఎదుట పడుకొని నిరసన తెలిపారు. దాంతో పోలీసులకు రైతు సంఘం నాయకులకు తోపులాట చోటు చేసుకుంది. దీంతో వ్యవసాయ అధికారులు పటేల్ సెంటర్‌కు వచ్చి ప్రభుత్వ నిర్ణయాన్ని చెప్పడంతో సీపీఎం, రైతు సంఘం నాయకులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మొక్కజొన్న పంటలు చేతికి వచ్చి నెల రోజులు అవుతుందన్నారు. క్వింటా రూ.1800లకు దళారులు కొనుగోలు చేస్తూ రైతులను దగా చేస్తున్నారన్నారు. చెప్పుకోవడానికే మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2,400 అని కేవలం ప్రకటించారే తప్పా... ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్నను కొనుగోలు చేయాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు స్వామన్న, పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, బాలయ్య, ఈశ్వరమ్మ, కర్ణ, వెంకటేశ్వర్లు, ఉస్మాన్‌బాషా, రంగమ్మ పాల్గొన్నారు.

కార్మిక హక్కులు హరించేలా చట్టాలు

ఆత్మకూరురూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల హక్కులను హరించేలా నల్లచట్టాలు తీసుకు రావడం దుర్మార్గమని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబా ఫకృద్దీన్, మండల కార్యదర్శి ప్రతాప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఆత్మకూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అన్వర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా శివనారాయణ, తొమ్మిదిమంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు చాంద్‌బాషా, ముర్తుజాబి, లక్ష్మీరత్నమ్మ, అంబన్న, మోజస్, సురేష్ రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబా ఫకృద్దీన్

విశిష్ట సంఖ్యతో లబ్ధి

బండిఆత్మకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు విశిష్ట సంఖ్య ఆధారంగానే ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందని తహసీల్దారు పద్మావతమ్మ, ఏవో పవన్ కుమార్ అన్నారు. బుధవారం బండిఆత్మకూరు తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతు ఆర్ఎస్‌కేలలో విశిష్ట సంఖ్య నమోదు పూర్తి చేయించుకోవాలన్నారు. అందుకు గ్రామ రెవెన్యూ అధికారులు సహకరించాలన్నారు. పంట దిగుబండి నమూనా సేకరణ ప్రతి గ్రామంలో వీఆర్వోలు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు లక్ష్మయ్య, సునంద, వీఆర్వోలు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

శ్రీశైలం నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు నిత్యకైంకర్యాలను యథావిధిగా నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బుధవారం ఉదయం సాక్షి గణపతికి విశేష అభిషేకాలు అర్చనలు చేసి నిత్యహోమాలు జరిపించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం ప్రదోష సమయంలో ప్రధాన ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న జ్వాలా వీరభద్రునికి అర్చక వేదపండితులచే షోడశోపచార పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.


దర్శనమిస్తున్న సాక్షి గణపతి

మల్లన్న సన్నిధిలో సినీ నటుడు శ్రీకాంత్

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను ప్రముఖ సినీనటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. బుధవారం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసుకున్న అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

మహానందిలో..

మహానంది : మహానంది క్షేత్రంలో నంద్యాల జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి శివారెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద మండల డిప్యూటీ ఎంపీడీవో కలువ భాస్కర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణమంటపంలో వీరిని ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మలు ఆశీర్వదించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్‌దౌలా పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యల ఏకరువు


సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ తహసీల్దార్ శ్రీవాణి

నంద్యాల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సర్వసభ్య సమావేశంలో సభ్యులు సమస్యల ఏకరువు పెట్టారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుగుణశ్రీ ఆధ్వర్యంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్లలాపురం, అయ్యలూరు, కొత్తపల్లి గ్రామాల చెందిన సర్పంచులు రమణమ్మ, ఓబులేసు, నారాయణ మాట్లాడుతూ గ్రామాలలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఒరిగిన స్తంభాలు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల చెరువు కట్ట సమీపంలో బిల్లలాపురం వెళ్లే దారిలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, డివైడర్ ఏర్పాటుచేయాలని కోరారు. రూరల్ తహసీల్దార్ శ్రీవాణి మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పీఎంలకు సంబంధించి గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యంతరాలుంటే తెలుపాలని సూచించారు. ఏవో ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్న క్వింటా రూ2400 ప్రకారం కొనుగోలు చేసేందుకు త్వరలో కేంద్రాలను ఏర్పాటు చేయనుందని తెలిపారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వందశాతం అక్షరాస్యతకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రంగముని

నందికొట్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వందశాతం అక్షరాస్యత కలిగిన దేశంగా తీర్చిదిద్దాలని, దానికి అందరూ కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగముని అన్నారు. బుధవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో మొట్టమొదటి భారత విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు.ప్రిన్సిపాల్ రంగముని మాట్లాడుతూ మౌలానా సేవల్ని, త్యాగాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఆయన చూపిన మార్గంలో విద్య అందరికీ అందేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవి, అధ్యాపకులు డా.ఎం.అన్వర్ హుస్సేన్, భాస్కర్, డా.చిట్టెమ్మ, ఖాజా హుస్సేన్, లక్ష్మీదేవి, తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లి పంట.. గొర్రెల పాలు

జూపాడుబంగ్లా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉల్లికి ధర లేకపోవడంతో రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు. రూ. లక్షల పెట్టుబడులు పెట్టి నష్టాల పాలవుతున్నారు. బుధవారం తంగడంచ గ్రామానికి చెంది న నాగశేషులు 5 ఎకరాలు, ధనుంజయుడు 3 ఎకరాలు ఉల్లిపంటను గొర్రెలు మేసేందుకు వదిలేశారు. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడి పెట్టి చివరకు పంటకోత సమయంలో ధరలేకపోవడంతో వదిలేశామని ఉల్లిరైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉల్లిపంట వేసి ధరలేకపోతే రైతుకు హెక్టారుకు రూ.50వేల ప్రకారం పంటనమోదు చేసుకున్న రైతులకు అందజేస్తామని చెప్పారు. అయితే నంద్యాల జిల్లాలో ఉల్లిపంట వేయలేదని ఉద్యానశాఖ అధికారుల నిర్లక్ష్యానికి ప్రభుత్వం అందించే పరిహారం అందకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఉల్లిరైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.


తంగడంచలో ఉల్లిపంటను తింటున్న గొర్రెలు

ఈవోఆర్డీకి పదోన్నతి


ఎంపీడీవో నాగఅనసూయను సన్మానిస్తున్న అధికారులు

గోస్పాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈవోఆర్డీ నాగఅనసూయ ఓర్వకల్లు ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. మండలంలో సుదీర్ఘ కాలంగా పనిచేసి పదోన్నతిపై వెళ్లిన నాగఅనసూయను బుధవారం మండల అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్థర్‌సైమన్, ఎంపీడీవో అమానుల్లా, టీడీపీ మండల అధ్యక్షుడు తులసీశ్వరరెడ్డి, ఏపీవో గంగన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలు

గోస్పాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ గృహకల్పలో అర్హులందరికీ పక్కా గృహాలు నిర్మిస్తుందని మండల ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎం.చింతకుంట్లలో వెంకటకృష్ణుడు, శివమ్మ దంపతులు ఎన్‌టీఆర్ గృహ కల్పకింద నిర్మించుకున్న గృహాన్ని అధికారులు ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

టీడీపీ మండల కన్వీనర్‌గా జయరామిరెడ్డి


జయరామిరెడ్డిని అభినందిస్తున్న నాయకులు

పాణ్యం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్‌గా మద్దూరుకు చెందిన గణపం జయ రామిరెడ్డి ఎంపికయ్యారు. బుధవారం కర్నూలులో జరిగిన నియోజవర్గ బూత్, క్లస్టర్, గ్రామ, యూనిట్, మండల కమి టీల ఎంపిక కార్యక్రమంలో జయరామిరెడ్డిని ఎన్నుకున్నారు. 7వ సారి ఎంపికైన జయరామిరెడ్డిని మండల నాయకులు, కార్యకర్తలు సత్కరించి అభినందించారు.

'కార్యకర్తలకు అండగా ఉంటాం'

గడివేముల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్య కర్తలకు అండగా ఉంటామని టీడీపీ మండల అధ్యక్షుడు పంట దిలీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యక ర్తల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకట్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంశీధర్‌రెడ్డి, చంద్రహాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

నంద్యాల టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పట్టణంలోని ప్రథమనంధీశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానానికి నిత్యావసర సరుకులు అందజేసినట్లు వాసవీ జాగృతీ క్లబ్ ఉమ్మడి జిల్లాల చార్టర్ గవర్నర్ బింగుమళ్ల శ్యాంసుందర్‌గుప్తా బుధవారం తెలిపారు. క్లబ్ సభ్యులు రమణయ్య, వెంకటేశ్వర్లు, మనోజ్, మోహన్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాణ్యం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని పాణ్యం గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 14న నెహ్రూ జయంతి, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ, 17న సమరయోధుల ప్రసంగాలు, వ్యాస రచన పోటీలు, 18న క్విజ్, చిత్రలేఖనపోటీలు, 19న వక్తృత్వ పోటీలు, 20న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అభ్యంతరాలు తెలియజేయాలి

మిడుతూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేలో అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లో తెలియజే యాలని ఎంపీడీవో దశరథరామయ్య సూచించారు. బుధవారం జలకనూరు గ్రామంలో స్వామిత్వ గ్రామసభ సర్పంచ్ ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. గ్రామసభలో డిప్యూటీ ఎంపీడీవో సంజన్న, పంచాయతీ కార్యదర్శి షఫీమహమ్మద్, గ్రామ పెద్దలు శివరామి రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల విద్యార్థినికి పురస్కారం

నంద్యాల రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం జడ్పీహెచ్ పాఠశాలకు చెందిన విద్యార్థిని షాలీహా పదవవతరగతి ఫలితాలలో రాష్ట్రంలోనే టాపర్‌గా నిలిచింది. విజయవాడలో జరిగిన జాతీయ విద్యా దినోత్సవంలో విద్యార్థిని షాలీహాను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సన్మానించి పురస్కారం అందజేసినట్లు హెచ్ఎం అలిలేలమ్మ బుధవారం తెలిపింది. విద్యార్థిని ఉపాధ్యాయులు సన్మానించారు.

మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం


వినతి పత్రాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : త్వరలో కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధరప్రకారం మొక్కజొన్న కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం జూపాడుబంగ్లాలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు, రైతులు తరలి వచ్చి ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. ప్రతి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో శ్మశానవాటిక ఏర్పాటు, అం దుకు అవసరమయ్యే స్థలాలను గుర్తించాలని ఏపీవోను ఆదేశించారు. మొత్తం 54 ఫిర్యాదు వచ్చినట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, టీడీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్‌డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ పరమేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతపై శ్రద్ధ వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కిశోర్

నంద్యాల కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే నోటిశుభ్రతపై శ్రద్ధ వహించాలని ఐడీఏ రాయలసీయ బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ కురుమేటి కిశోర్ కుమార్ అన్నారు. బుధవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాయలసీమ బ్రాంచ్ ఆధ్వర్యంలో సన్‌రైజ్ పాఠశాలలో విద్యార్థులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. అలాగే బ్రష్ చేసే విధానంలో మెళకువలు తెలిపారు. కార్యక్రమంలో ఐడీఏ రాయల సీయ బ్రాంచ్ కార్యవర్గసభ్యులు డాక్టర్ సునీల్‌జాషువా, డా క్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి , పాఠశాల నిర్వాహకుడు భాస్కర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైల జలాశయానికి నిలకడగా వరద

శ్రీశైలం నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద నిలకడగా కొనసాగుతోంది. బుధవారం ఎగువ నుంచి 13,000 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా చేరినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఎడమగట్టు విద్యుదుత్పత్తి ద్వారా 35,315 క్యూసెక్కుల నీరు దిగువన విడుదల చేస్తున్నారు.

యువకుడిపై కేసు నమోదు

కొత్తపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన యువకుడిపై యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. వివరాలిలా.. మండలంలోని ఓ యువతిని తమ్మలూరు గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించాడు. తీరా పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించాడు. దాంతో యువతి మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

అధికారులను ఆదేశించిన మంత్రి బీసీ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తర్విత గతిన పరిష్కరించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి బీసీ అర్జీలను స్వీకరించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో మౌలిక సదూపాయాల కల్పనపై వచ్చే సమస్యలను పరిష్కరిం చేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్: నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్‌ఫండ్ అని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం ఆవరణలో సీఎం సహాయనిధి కింద రూ.25.09 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలను మంత్రి పంపిణీ చేశారు. మంత్రి బీసీ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం కొండంత భరోసా అన్నారు. చెక్కులు అందుకున్న బాధితులు సీఎం చంద్రబాబు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



చెక్కులు అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పట్టుబడిన మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కోవెలకుంట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో 31 పాత కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను నంద్యాల అసిస్టెంటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు, నంద్యాల స్క్వాడ్ సీఐ లక్ష్మణ్‌రాజ్, కోవెలకుంట్ల ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌చార్జి సీఐ సందీప్ ఆధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నంద్యాల అసిస్టెంటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు కోవెలకుంట్ల ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం సర్కిల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో పాత కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను ధ్వంసం చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

బనగానపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో సీఐటీయూ జనరల్‌బాడీ సమావేశం బుధవారం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లపై యాప్‌ల భారం అధికంగా ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు అందించాలన్నారు. యూనియన్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు షేబారాణి, కార్యదర్శి రోజా రమణి, రమాదేవి, అనసూయ, తులశమ్మ, సుకన్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష

బనగానపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలోని టీడీపీ నాయకుడు పుల్లారెడ్డి ఇంటిలో అయ్యప్ప మాలధారులకు బుధవారం భిక్ష ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పాల్గొని అయ్యప్ప స్వామికి పూజలు చేశారు.

శివ మాలధారులకు..

అవుకు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో శివ మాలధారులకు జైపాల్‌రెడ్డి, మల్లీశ్వరి దంపతులు బుధవారం భిక్ష ఏర్పాటు చేశారు. ఆలయంలోని శివుడికి పూజలు నిర్వహించారు.

పకడ్బందీగా సర్వే: ఎంపీడీవో

కొలిమిగుండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వామిత్వ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దస్తగిరి బాబు తెలిపారు. బుధవారం మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో స్వామిత్వ సర్వేపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గతంలో చేపట్టిన సర్వే వివరాలను ప్రజలకు వివరించారు. అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, గ్రామ సర్పంచ్, మల్లేశ్వరి, టీడీపీ నాయకులు తోట అమర్నాథ రెడ్డి, బాయికాటి హుసేన్ పీరా, శేషారెడ్డి, పరమేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భార్గవి పాల్గొన్నారు.

కృష్ణ మందిరంలో గీతా పారాయణం



శ్రీకృష్ణ మందిరంలో గీతాపారాయణానికి హాజరైన భక్తులు

కొలిమిగుండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ మందిరం, కొలిమిగుండ్ల కొండపై వెలసిన కాల భైరవ స్వామి ఆలయంలో బహుళాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం కార్తీకమాసం బహుళాష్టమి కావడంతో బెలుం గ్రామంలోని శ్రీకృష్ణుడికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త వైవీఎస్ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు , గీతాపారాయణం నిర్వహించారు. చెర్లోపల్లె గ్రామానికి చెందిన మురారి పుల్లయ్య, ఆలయ నిర్వాహకులు బాచం వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కొలిమిగుండ్ల కొండపై వెలిసిన కాలభైరవ స్వామికి ఆలయ నిర్వాహకుడు పేరం బయ్యపు రెడ్డి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించి స్వామి వారి నిజరూప దర్శనం కల్పించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● గృహ ప్రవేశాలను ప్రారంభించిన అధికారులు, టీడీపీ నాయకులు

చాగలమర్రి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, ఎంపీడీవో తాహిర్‌హుసేన్, హౌసింగ్ ఏఈ నవిన్ అన్నారు. బుధవారం చాగలమర్రిలో కొత్తగా నిర్మించుకున్న పక్కా గృహాన్ని వారు ప్రారంభించారు. అసంపూర్తిగా ఉన్న గృహాలు కూడా మార్చి చివరి వరకు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈవో తారకేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఓబులేసు, సుబ్బరామయ్య, సలీమ్, టీడీపీ రాష్ట్ర డైరెక్టర్ అజీమ్, టీడీపీ నాయకులు కొలిమిషరీఫ్, మౌళాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, మాబు లాల్, జల్సాగౌస్, కరిముల్లా, రమేష్, అబ్దుల్‌ఖాదర్, అస్రఫ్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో కుమ్మరి వేదవతి గృహాన్ని మండల అధికారులు ప్రారంభించారు. తహసీల్దారు ప్రసాద్‌బాబు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, హౌసింగ్ ఏఈ నరసింహారావు, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆకుల చిన్న వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రుద్రవరం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నూతన గృహాలను నిర్మించుకు నేందుకు అవకాశం కల్పించడం వరమని టీడీపీమండల కన్వీనర్ రంగ నాయకులు, నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ అన్నారు. బుధవారం రుద్రవరంలో రెండు గృహాలు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ విజయబాబు, ఎంపీ డీవో భాగ్యలక్ష్మి, తహసీల్దారు జోసీ ఆల్‌ఫ్రెడ్, డిప్యూటీ తహసీల్దారు చంద్ర శేఖర్, నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, నంద్యాల నారాయణరెడ్డి, వీఆర్వో సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సంజామల: మండల కేంద్రమైన సంజామలలో తహసీల్దార్ అనిల్ కుమార్, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు ఆధ్వర్యంలో లబ్దిదారుడు కుళా యిస్వామి ఇంటికి బుధవారం గృహ ప్రవేశం చేయించారు. సంజామల మండలంలోనే మూడు లక్షల ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్కి హుసేన్, మద్దిలేటి, సుబ్బారావు, హౌసింగ్ వర్క్ ఇన్స్‌పెక్టర్ శంకర్ రెడ్డి, హాజి వలి పాల్గొన్నారు.

దొర్నిపాడు: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని దొర్నిపాడు సొసైటీ చైర్మన్ సిద్ధి సత్యనారాయణ, కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు లింగుట్ల వెంకట్‌నాయుడులు అన్నారు. బుధవారం దొర్నిపాడు, చాకరాజువేముల, గుండుపాపల తదితర గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి గోవిందనాయక్, ఎంపీడీవో సావిత్రిలు లబ్ధిదారులు కొత్తగా నిర్మించుకున్న పక్కా గృహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో లింగుట్ల రమణయ్య, హబీబ్ బాషా, ఎండూరి గోపాల్‌నాయుడు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



రుద్రవరంలో..



చాగలమర్రిలో పక్కా గృహాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు



ఉయ్యాలవాడలో..

సొంత ఇంటి కల్పనే చంద్రబాబు ధ్యేయం

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదలకు సొంత ఇల్లు కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నా రు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద మన ఇల్లు - మన గౌరవం అనే కార్యక్రమంలో భాగంగా నూతనంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తుంద న్నారు. కార్యక్రమంలో కేడీసీసీ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, లక్కసాగరం లక్ష్మీరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు ఆర్‌ఈ రాఘవేంద్రగౌడు, బీజేపీ నాయకులు నందు వెంకటరమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, పీఏసీఎస్ చైర్మన్ ఎల్లగౌడు పాల్గొన్నారు.

దిగువ అహోబిలం హుండీ ఆదాయం రూ.30.90 లక్షలు

ఆళ్లగడ్డ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దిగువ అహోబిలంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. మఠం సీఈఓ సుందర రాజన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. దిగువ అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఆలయాలలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా రూ 30,90,084లు ఆదాయం వచ్చినట్లు మఠం అధికారులు తెలిపారు. అలాగే 19 గ్రాముల బంగారం, 800 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. అలాగే ఎగువ అహోబిలంలో 199 గ్రాముల బంగారం, 3 కేజీల 100 గ్రాముల వెండి వచ్చిందన్నారు.



హుండీ లెక్కిస్తున్న అధికారులు

ప్రైవేటీకరణ ప్రయత్నాలు దుర్మార్గం

మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి





డోన్ పాతబస్టాండులో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి , బనగానపల్లెలో ర్యాలీ చేస్తున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసీపీ కార్యకర్తలు

డోన్ రూరల్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాల లను కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ ప్రయత్నాలు దుర్మార్గమని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. బుధవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో డోన్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డోన్ ఆర్డీవో కార్యాలయంలో వైసీపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, జడ్పీటీసీ సభ్యుడు బద్దెల రాజ్‌కుమార్, నాయకులు పోస్టు ప్రసాద్, సోమేష్ యాదవ్, మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

● డోన్‌లో వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి వామపక్షాలు సంఘీభావం తెలిపాయి. సంఘీభావం తెలిపిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, శివరాం, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

బనగానపల్లె: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, బనగానపల్లె నియోజకవర్గ పరిశీలకులు భూమా కిశోర్‌రెడ్డి, చల్లాభగీరథరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డిలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయల్టీ ప్రైవేటీకరణ రద్దు చేయాలి



రోడ్డుపై బైఠాయించిన మైనింగ్ ఫ్యాక్టరీల యజమానులు, కార్మికులు

డోన్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మైనింగ్ రాయల్టీ ప్రైవేటీకరణను రద్దు చేయాలని డోన్, ప్యాపిలి మండలాలకు చెందిన ఫౌడర్ ఫ్యాక్టరీ, మైనింగ్ యజమానులు చంద్రపల్లె లక్ష్మీనారాయణ, అంకిరెడ్డి, ఐపీ శేఖర్, గిరిప్రసాద్, ఎస్‌ఎల్ మధుసూదన్ అన్నారు. బుధవారం కొట్టవారిపల్లె సర్కిల్‌లో మైనింగ్, ఫౌడర్ ఫ్యాక్టరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనింగ్ రాయల్టీ ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం వల్ల చిన్న తరహా పరిశ్రమల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ప్రైవేటు ఏజెన్సీలు అధిక లోడు పేరుతో మైనింగ్ యజమాన్యాలను వేధింపులకు గురి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న రాయల్టీ ధర కంటే రెట్టింపు ధరలు వసూలు చేయడం వల్ల పరిశ్రమలు నష్టాల ఊబిలోకి పోయి మూసివేసుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు ధర్మవరం చంద్రశేఖర్ రెడ్డి, పీవీ సుబ్బారెడ్డి, ఓబుల్ రెడ్డి, చిన్నమల్కాపురం సుధాకర్ రెడ్డి, మురళీరెడ్డి, ధర్మవరం రఘురెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పీడీ ప్రతిభ



ఉపాధ్యాయులతో పీడీ బాషా

సంజామల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ క్రీడా పోటీల్లో సంజామల పీడీ బాషా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాన్ని దక్కించుకున్నారు. ఈనెల 5వ తేదీ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన 23వ ఏసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 40+ విభాగంలో షార్ట్‌పుట్ త్రోలో బాషా ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాన్ని దక్కించుకున్నారు. బుధవారం సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం షబ్బీర్ హుసేన్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి పీడీ బాషాను అభినందించారు. బాషా మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో పాల్గొనడం తనకు ఆనందాన్ని కలిగించిందన్నారు. పీడీ బాషాను డీఈవో జనార్దన్‌రెడ్డి అభినందించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయానికి ఆహ్వానించి బాషాను సత్కరించారు. ఉపాధ్యాయులు పరమేశ్వరరెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, వెంకట రంగన్న, రాజశేఖర్, వసంత లక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి: ఏడీఏ

కోవెలకుంట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శనగపంట సాగు చేసేటప్పుడు విత్తనశుద్ధి తప్పక చేయాలని కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకుడు సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని కలుగొట్ల, జొలదరాశి గ్రామాల్లో పొలంబడి మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడీఏ సుధాకర్ మాట్లాడుతూ విత్తనం వేసేటప్పుడు ఖచ్చితంగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు రైతు సేవాకేంద్రం సిబ్బంది ఈశ్వరమ్మ, రైతులు పాల్గొన్నారు.

15న జాబ్ మేళా

ఆళ్లగడ్డ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, 10 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. మేళాలో పాల్గొనే వారు పదో తరగతి, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ చేసిన వారు అర్హులు, బయోడేటా, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటో, విద్యార్హత పత్రాలు తీసుకొని ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 6305399744 నెంబ ర్‌ను సంప్రదించాలని సూచించారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

బేతంచెర్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం గ్రామంలో ప్రాథమిక వైద్యశాల డాక్టర్లు అబ్దుల్ సలీం, ముర్తుజావలి ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కుష్టు వ్యాధి ఎలా గుర్తించాలని శిక్షణ కార్యక్రమం జరిగింది. ఏఎన్‌ఎంలు, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

చాగలమర్రి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న సమ్మెటివ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో న్యామతుల్ల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండ లంలోని చింతలచెరువు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సమ్మెటివ్ పరీక్షలను పరిశీలించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2కోట్లు

ఉయ్యాలవాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2కోట్ల నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చొరవతో ఉపాధి హామీ కింద ఈ నిధులు మంజూరు అయ్యాయన్నారు. సుద్దమల్ల, ఆర్.పాంపల్లె, పెద్ద యమ్మనూరు గ్రామాలకు రూ.5లక్షల చొప్పున, రూపనగుడి, అల్లూరు, హరివరం, పడిగెపాడు, ఇంజేడు, బోడెమ్మనూరు, కొండు పల్లె, మాయలూరు గ్రామాలకు రూ.10లక్షలు, తడుమలదిన్నె, గోవిందపల్లె, నర్సిపల్లె, ఆర్.జం బులదిన్నె, గ్రామాలకు రూ. 15 లక్షలు, ఉయ్యాలవాడ గ్రామానికి రూ. 20 లక్షలు మంజూరు అయ్యిందన్నారు.

ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు రూ.1.46 కోట్లు: మండలంలోని అల్లూరు, హరివరం, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాల ఏర్పా టుకు రూ. 1.46 కోట్లు మంజూరైనట్లు పీఆర్ ఏఈ తెలిపారు. ఒక్కో కేంద్ర నిర్మాణానికి రూ. 36 లక్షలు నిధులు ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

చెత్తసేకరణ సులభతరం

రుద్రవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామంలో చెత్త సేకరణ సులభ తరమవుతుందని, స్వచ్ఛభారత్ కింద రూ.10 లక్షలతో ట్రాక్టరు మంజూరైంద ని సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి అన్నారు. బుధవారం ఆలమూరు గ్రామంలో సర్పంచ్, టీడీపీ నాయకులు ట్రాక్టరును ప్రారంభించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు పత్తి బ్రహ్మయ్య, వెంకటసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ ఖాదర్‌హుసేన్, ఎంపీటీసీ మీరాంబీ, ఫీల్డ్ అసిస్టెంటు గురప్ప, కార్యదర్శి పాములేటి పాల్గొన్నారు.

భూరీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

చాగలమర్రి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన నగల్లపాడు, కలుగొట్లపల్లె గ్రామాల్లో భూరీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. ఆయా గ్రామాల్లో బుధవారం రైతుల సహకారంతో రోవర్ ద్వార భూరీసర్వే పనులు ప్రారం భించారు. గ్రామాలలో సర్వే నంబర్ల ఆధారంగా భూముల కొలతలు తీసి సరిహద్దులు గుర్తిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ దేవరాజు, సర్వేయర్లు అహ్మద్‌బాషా, లీలావతి, అఖిల్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

దొర్నిపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయాధికారి ప్రమీల హెచ్చరించారు. బుధవారం దొర్నిపాడు గ్రామంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏవో మాట్లాడుతూ ఎరువుల డీలర్లు నాణ్యమైన ఎరువులను మాత్రమే విక్రయించాలని సూచించారు. దుకాణంలో స్టాక్ వివరాలను బోర్డుపై తప్పక ఉంచాలన్నారు. అనంతరం ఎరువుల దుకాణాల్లో రిజిస్టర్లు, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఆమె వెంట ఏఈవోలు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్మలమడుగు రహదారిలో సీఐ హనుమంతనాయక్ బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సర్టిఫికెట్లు, లైసెన్సులు లేని వాహనాలకు జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.


ఆర్యవైశ్యుల కార్తీక వన భోజనాలు



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

బేతంచెర్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బేతంచెర్ల పట్టణంలో ఆర్యవైశ్యులు కర్నూలు రహదారిలోని గుండా జయచంద్ర మామిడి తోటలో కార్తీక వనభోజనాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు ఉసిరి చెట్టుకు పూజ లు చేశారు. కార్యక్రమంలో గూండా గోపాల్, బచ్చు సుబ్రహ్మణ్యం, రామ్మూర్తి మరో 300 మంది ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బీసీ హాస్టళ్ల భవనాలకు రూ.8.30 కోట్లు



మాట్లాడుతున్న జగ్గయ్య

చాగలమర్రి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో కోవెలకుంట్ల, నంద్యాలలో బీసీ హాస్టళ్ల భవనాల కోసం రూ.8.30 కోట్లతో ప్రతిపాదనలు చేసినట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నవంగలి ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ హాస్టళ్ల మర మ్మతులకు రూ.3 కోట్లు నిధులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. హాస్టల్ వార్డెన్ ఖాసీం ఉన్నారు.

దేశం గర్వించదగిన శాస్త్రవేత్త డాక్టర్ సలీం



మాట్లాడుతున్న అధ్యాపకుడు రామసుబ్బారెడ్డి

కోవెలకుంట్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ సలీం ఆలీ దేశం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త అని అధ్యాపకుడు రామసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ బొమ్మిడాల డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో పక్షిశాస్త్రవేత్త డాక్టర్ సలీం ఆలీ జయంతి వేడుకలు నిర్వహించారు. అధ్యాపకుడు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సలీం ఆలీ పక్షుల జీవన విధానం అధ్యయనం చేశారని, ఆయన రచించిన అనేక పుస్తకాలు నేటి పరిశోధనలకు మార్గదర్శకంగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు లక్ష్మీదేవి, నరేంద్రనాథరెడ్డి, క్రిష్ణదాసు, రమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.